క్లుప్తంగా

ఆహార సంరక్షణపై అవగాహన



వినుకొండ(నూజెండ్ల): ఆహార సంరక్షణపై నైపుణ్యం కలిగి ఉండటం ప్రతి ఒక్క విద్యార్థినీకి అవసరమని ఉప్పలపాడులోని ఏపీ డాక్టర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.రమణమ్మ అన్నారు. నైపుణ్యం కలిగిన ఫుడ్ ప్రాసెసింగ్ ట్రేడ్‌పై అవగాహన కార్యక్రమాన్ని పట్టణంలోని పలు బేకరి, రెస్టారెంట్‌ల్లో ఆహార పదార్థాలు ఎలా తయారు చేయాలో పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఒకేషనల్ టీచర్ ఎ.ఉషారాణి, ఉపాధ్యాయినీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై సమీక్ష



బొల్లాపల్లి : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా చేపట్టాల్సిన అంశాలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వో, వీఆర్వోలతో తహసీల్దార్ బి.వి.రమణారావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఓటరు నమోదు, తిరస్కరణ, దాఖలైన అర్జీలను విచారించి ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటలలోపు తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. నూతనంగా ఓటరు నమోదు చేసుకున్న వారికి ఓటు హక్కు కల్పించాలని, విచారించి జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని, ఓటును సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ వి.సుధాకర్ శర్మ, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రక్త పరీక్షకు నూతన యంత్ర పరికరం



శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా అంటు వ్యాధులు ప్రబలిన సమయంలో చేయాల్సిన రక్త పరీక్షలకు సంబంధించిన ప్రత్యేక ఆధునిక మిషన్ ప్రభుత్వం మంజూరు చేసినట్లు మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ గురువారం తెలిపారు. సాధారణ జ్వరం, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా తదితర రక్త నిర్ధారణ వైద్య పరీక్షలు చేయించడానికి ఈ ఆధునీకరణ యంత్రకరణ పరికరం ఎంతో దోహదపడుతుంది. రక్త పరీక్షలు చేయడం ద్వారా తెల్ల రక్తకణాలు శాతం నమోదు చేయడానికి నూతన యంత్ర పరికరం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇప్పటికే ఆరోగ్య కేంద్రంలో క్షయ, కిడ్నీ, కొవ్వు తదితర వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయనతో పాటు ల్యాబ్ టెక్నీషియన్స్ సతీష్, సీతారామిరెడ్డి, స్టాఫ్‌నర్సు బాలిబోయిన లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

సాతులూరులో వైభవంగా సిడిమానోత్సవం



నాదెండ్ల: మండల పరిధిలోని సాతులూరు గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవతల ఆలయాల తొమ్మిదో వార్షికోత్సవం గురువారంతో ముగిసింది. గత నెల 31న ప్రారంభమైన వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సిడిమానోత్సవం నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా మేళతాళాలతో స్వామి వారిని ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలంకరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

జగనన్న పాలనలోనే మహిళా సాధికారత

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత చెక్కు అందజేత



డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు: మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత సంబరాలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా మండల పరిధిలోని 778 డ్వాక్రా సంఘాలకు రూ.6.15 కోట్ల చెక్కును ఎమ్మెల్యే బొల్లా అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా అక్కాచెల్లెమ్మల ఖాతాల్లో నగదును జమ చేస్తూ వారి అభ్యున్నతికి దోహదపడుతున్నారని తెలిపారు. నవరత్న పథకాల ద్వారా ప్రతి ఒక్క కుటుంబానికి లబ్ధి చేకూరుస్తున్నారని గుర్తు చేశారు.

దేశ చరిత్రలోనే రూ.250 కోట్లు పథకాల రూపంలో ప్రజలకు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. డ్వాక్రా అక్కాచెల్లెమ్మలు తీసుకున్న రుణాలను మాఫీ చేసి ఆడిన మాటను తప్పని ముఖ్యమంత్రిగా నిరూపించుకున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నడూ చూడని అభివృద్ధిని నేడు మనం చేస్తున్నామని, ఇదంతా ముఖ్యమంత్రి చొరవే అని కొనియాడారు. వినుకొండలో సరైన వైద్యశాల లేక మెరుగైన వైద్యం కోసం నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను సీఎం జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి వినుకొండలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడంతో పాటు నిధులు కూడా విడుదల చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నానని అన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజలే బేరీజు వేసుకోవాలన్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే మోసపూరిత మాటలు...

ప్రజలకు మాయమాటలు చెప్పి మరోసారి అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు నాయుడు శత విధాలా ప్రయత్నం చేస్తున్నాడని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు చేయలేని అభివృద్ధి ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నారని, ప్రజలు ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. నియోజకవర్గంలో కాని, రాష్ట్రంలో కాని చెప్పుకోదగ్గ పని ఒక్కటైనా ఉందా అని గుండెల మీద చేయి వేసుకుని నిరూపించుకోవాలన్నారు. ఇలాంటి బురిడీ మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, మరో ఐదు సంవత్సరాలు జగన్ మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రిగా మనమందరం చూస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుర్లపాటి చౌడయ్య, మండల పార్టీ అధ్యక్షులు కోపెల దేవరాజ్, పార్టీ నాయకులు బుచ్చయ్య, గోనుగుంట్ల వెంకట హనుమయ్య, సొసైటీ అధ్యక్షుడు బొల్లా బుజ్జి, తహసీల్దార్ దిలీప్ కుమార్, ఎంపీడీవో రంగనాయకులు, ఏపీఎం రంగారెడ్డి పాల్గొన్నారు.

చకచకా జగనన్న ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్లు

వేర్వేరు మండలాల్లో పూర్తిచేస్తున్న సిబ్బంది



గణపవరం సచివాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్



గుట్లపల్లి సచివాలయ పరిధిలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌కు హాజరైన లబ్ధిదారులు

నాదెండ్ల: పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ డీవీవీ వరకుమార్ చెప్పారు. గణపవరం మూడో సచివాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఇప్పటి వరకూ 80 శాతం గ్రామ పరిధిలోని నాలుగు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయినట్లు వీఆర్వో సాంబశివరావు తెలిపారు. మండల పరిధిలో 2370 మంది లబ్ధిదారులకుగాను ఇప్పటి వరకూ 79 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయన్నారు. ఈ నెల 19 నాటికి నూరుశాతం రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియ జరుగుతున్నందున సర్వర్‌లో సాంకేతిక లోపం కారణంగా రిజిస్ట్రేషన్లు నెమ్మదిగా జరుగుతున్నాయన్నారు. రాత్రి 10 గంటల వరకైనా సిబ్బంది రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గడువు నాటికి అందరికీ రిజిస్ట్రేషన్లు చేస్తామన్నారు. ఆయనతో పాటూ ఆర్‌ఐ రమీజా, వీఆర్వోలు వెంకటరమణ, అంకమ్మరావు, వీరయ్య ఉన్నారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి : ప్రతి సచివాలయం పరిధిలో జగనన్న ఇళ్ల కాలనీకి సంబంధించి కేటాయించిన నివేశన స్థలాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని తహసీల్దార్ బి.వి.రమణారావు తెలిపారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో 2 వేల మందికి పైగా జగనన్న ఇళ్ల కాలనీలో నివేశనస్థలాలు కేటాయించామన్నారు. వీటిలో 1600 మంది లబ్ధిదారులకు సంబంధించి రిజిస్ట్రేషన్ నమోదు జరగనుందన్నారు. వీటిలో 800 మంది లబ్ధిదారుల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని, మిగిలినవి త్వరలో పూర్తి చేస్తామన్నారు. కొన్ని దరఖాస్తులు కోర్టు కేసులు, సాంకేతిక సమస్యల వల్ల కొంత మంది లబ్ధిదారుల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయన్నారు. నివేశనస్థలం పొందిన లబ్ధిదారులు తప్పనిసరిగా ఆయా సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ నమోదు కోసం సంప్రదించాలని సూచించారు.

ములకలూరులో లేగదూడల ప్రదర్శన

నరసరావుపేట రూరల్: లేగదూడల సంరక్షణలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలుజాతి పాడి పశువులను తయారు చేసుకోవచ్చని పశుసంవర్ధక శాఖ ఏరియా వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని ములకలూరు పశువైద్యశాలలో గురువారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ములుకలూరు, పెదరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన 69 లేగదూడలు ఈ ప్రదర్శలో పాల్గొన్నాయి. మేలైన మూడు లేగదూడలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి లేగదూడలే రేపటి పాడి పశువులు అని తెలిపారు. లేగ దూడల యాజమాన్యంపై అవగాహన కల్పిస్తూ మెరుగైన పద్ధతులు పాటించడం వల్ల నాణ్యమైన పాల దిగుబడి సాధించవచ్చని తెలిపారు. ములకలూరు పశు వైద్యశాల వైద్యుడు డాక్టర్ ఎం.అర్జునరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామ సర్పంచ్ జే.యేసుదయ, ఎంపీటీసీ సయ్యద్ మస్తాన్‌బీ, పలువురు పశువైద్యాధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైల్లో అక్రమ మద్యం పట్టివేత

నరసరావుపేట టౌన్: రైల్లో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.85 వేల రూపాయల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ తన్నీరు సుబ్బారావు తెలిపారు. గురువారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు హుబ్లీ టు విజయవాడ ఎక్స్‌ప్రెస్ రైల్లో గురువారం తనిఖీలు చేపట్టామన్నారు. క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామానికి చెందిన షేక్ బెల్లంకొండ ఇమ్రాన్ సూట్‌కేసులో 26 మద్యం బాటిళ్లు అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. విచారణలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లుగా తేలిందన్నారు. అక్కడ మిలటరీ వాళ్లకు సరఫరా చేసే బాటిళ్లుగా వాటిని గుర్తించామన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డెంగీ జ్వరాలు లేవు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో సాధారణ జ్వరాలు ఉన్నాయని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ గురువారం తెలిపారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామంలో ప్రస్తుతానికి వైద్య శిబిరం కొనసాగుతుందని, సాధారణ జ్వరాలు మినహా, డెంగీ జ్వరాలు లేవన్నారు. ప్రజలు అపోహలు నమ్మరాదన్నారు. వైద్య ఆరోగ్య శిబిరం రెండు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే పనులు చేస్తున్నారని జ్వర బాధితులను గుర్తించి మెరుగైన వైద్యసేవలు సకాలంలో అందించేలా చర్యలు చేపట్టామన్నారు. ఆయనతో పాటు ఆరోగ్య కార్యకర్తలు అమరలింగేశ్వరి, విజయమ్మ, శ్యామలత పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులు

ఏఈ ఆకాష్

శావల్యాపురం: జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా మండలంలోని నాలుగు గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూఢవత్ ఆకాష్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఈ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు సహకారంతో జలజీవన్ మిషన్ పథకంలో అభివృద్ధి పనులు పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. మండలంలోని భాస్కర్ నగర్ గ్రామంలో రూ.83 లక్షల వ్యయంతో ఐదు కిలోమీటర్ల మేర పైపులైను, ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులతో పాటు 120 ఇంటింటి నీటి కుళాయిలు పనులు చేపట్టామన్నారు. అలాగే మండలంలోని మతుకుమల్లి గ్రామంలో రూ. ఒక కోటి 15 లక్షల వ్యయంతో గ్రామంలో 10 కిలోమీటర్ల వరకు పైపులైను పనులు 1032 ఇంటింటి నీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలోని శానంపూడి గ్రామంలో రూ. 50 లక్షల వ్యయంతో గతంలో ఉన్నటువంటి పాత మంచినీటి చెరువు మరమ్మతులు చేయించి 3 కిలోమీటర్ల వరకు పైపులైను ఇంటింటి 455 నీటికుళాయిలు పనులు జరుగుతున్నాయన్నారు. మండలంలోని చినకంచర్ల గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో నిధులు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన పనులు తుది దశకు చేరినట్లు త్వరలో ప్రారంభిస్తున్నట్లు ఏఈ వెల్లడించారు.

బాలికలు ఆత్మరక్షణ విద్యపై అవగాహన ఏర్పరచుకోవాలి



కరాటే దుస్తుల నిమిత్తం నగదు అందచేస్తున్న సుబ్బరాయగుప్త

నరసరావుపేట ఈస్ట్: బాలికలు ఆత్మరక్షణ విద్యల పట్ల అవగాహన కలిగి ఉండాలని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల పాలకవర్గ కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్త తెలిపారు. పెదచెరువులోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఉజ్వల భారతి మహిళా శక్తి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కరాటే శిక్షణ తరగతులకు హాజరైన బాలికలకు రూ.25 వేలు కరాటే దుస్తుల నిమిత్తం పాఠశాల ప్రిన్సిపల్ ప్రమీలారాణికి అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలలో చదువుతున్న బాలికలకు ఎటువంటి అవసరం వచ్చినా తనవంతు సహాయం అందిస్తానని తెలిపారు. బాలికలు ఆత్మస్థైర్యంతో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. సమాజంలో ఎదురయ్యే వేధింపులను ఎదుర్కొనేందుకు కరాటే వంటి ఆత్మ రక్షణ విద్య ఉపయోగపడుతుందని తెలిపారు. పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రమీలారాణి, సేవా సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి, కరాటే శిక్షకురాలు చైతన్యదీప్తి తదితరులు పాల్గొన్నారు.

భాషా ప్రాధాన్యతతోనే బోధనలో మెరుగు

- డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సుభాని
- బోయపాలెం జిల్లా విద్యాశిక్షణ సంస్థలో స్టెప్ శిక్షణ కార్యక్రమం షురు



కార్యక్రమం గురించి వివరిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని

యడ్లపాడు: భాష ప్రాధాన్యతను గుర్తించి భిన్న రూపాల్లో విశ్లేషిస్తూ వినియోగించేలా చేయడమే స్టెప్ శిక్షణ ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యాశిక్షణ సంస్థలో ఆంగ్ల ప్రావీణ్యం ప్రామాణిక పరీక్షపై నాలుగు రోజులు శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన పలు ప్రభుత్వ పాఠశాలల్లో బయాలజికల్, ఫిజికల్, సోషల్, గణితం, ఆంగ్లం సబ్జెక్టుల ఉపాధ్యాయులు 40 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శిక్షణ ఆవశ్యకత, వాటి ప్రయోజనాలను ఆయన వివరించారు. ఈ శిక్షణ రెండు రోజులు ఆఫ్‌లైన్ శిక్షణ ఉంటుందని, మిగిలిన రెండు రోజులు ఆన్‌లైన్ ద్వారా అవగాహన కల్పిస్తున్న వెల్లడించారు. అనంతరం ది హిందూ గ్రూప్ సంస్థకు చెందిన ఎస్ఆర్‌పీలు భాగ్యలక్ష్మి, ప్రియదర్శిని తరగతి గదిని నిర్వహణ, విద్యార్థులను సంసిద్ధుల్ని చేయడం, బోధనలో భిన్న పద్ధతులను అవలంభించడంపై మాస్టర్ ట్రెనర్స్‌కు వివరించారు. కార్యక్రమాన్ని శిక్షణ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.ప్రసాద్ పర్యవేక్షించగా, డైట్ అధ్యాపకులు సహకారం అందించారు.

రేపు డయల్ యువర్ డీఎం

చిలకలూరిపేటటౌన్: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సూచనలు అందజేయాలని డిపో మేనేజర్ ఎస్.రాంబాబు కోరారు. ఇందుకోసం ఈ నెల 10వ తేదీ శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలను ప్రకటించిన సమయంలోగా సెల్ నంబర్ 9959225427కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరికరాలు వితరణ

వినుకొండ(నూజెండ్ల): విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాసనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి ప్రెషర్ కుక్కర్ పప్పు కుక్కర్ లు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యుడు భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను గురించి వివరించారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలను పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎ.రామలింగేశ్వరరావు, పి.నారాయణ, బీపీఎస్ సుందరరావు, వై.వి. సుబ్బయ్యశర్మ, జి. నాగేంద్రుడు, పులుపుల రాము, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: ప్రకాష్‌నగర్‌లో మానసికస్థితి సరిగ్గా లేని స్వరూపారాణి అనే యువతి అదృశ్యమైనట్లు ఆ యువతి అన్న ఆనంద్ ఫిర్యాదు చేసినట్లు ఒన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి గురువారం వెల్లడించారు. ప్రకాష్‌నగర్ వన్నూరుకుంట పార్కు సమీపంలో నివాసం ఉండే స్వరూపారాణి ఈనెల ఒకటో తేదిన ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని, ఆమె ఆచూకీకోసం వెతికినా లభ్యంకాలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

టిప్పర్ ఢీకొని వెల్లటూరు వాసి దుర్మరణం



వినుకొండ (నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన వినుకొండ రూరల్ చీకటీగలపాలెం అడ్డరోడ్డు వద్ద నున్న పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన పుట్టిగంపల నాగేశ్వరరావు (48) ద్విచక్ర వాహనంపై వెల్లటూరు వెళ్లే క్రమంలో, టిప్పర్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు.

నేడు ఉన్నవలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

యడ్లపాడు: పేదలకు మెరుగైన వైద్యం స్థానికంగానే అందించాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 మండలంలోని ఉన్నవ గ్రామంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.ప్రభాకరరావు తెలిపారు. క్యాంపెయిన్‌లో భాగంగా వైద్యబృందం ఇంటింటి సందర్శన, అనారోగ్య సమస్యలున్న వారిని గుర్తించడం జరిగింది. ఈ మెగా వైద్యశిబిరం ఏర్పాటుతో ఎంబీబీఎస్ వైద్యులతో పాటు స్పెషలిస్టు వైద్యులు, కంటివైద్యులు హాజరై రోగులకు చికిత్సలు, మందులు ఉచితంగా అందించడం అవసరమైన వారికి పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేస్తారన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ హెల్త్‌క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిత్యావసరాలు పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులో గల చైతన్యనగర్‌లో వినుకొండ చర్చ్ ఆఫ్ క్రైస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో పేద వితంతువులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈవో ఎండీ రాజు మాట్లాడుతూ సొసైటీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సభ్యులు ఎం.రమేష్‌బాబు, ఎం.ప్రవళిక, ఎస్. బ్రహ్మయ్య, టి. వెంకటకృష్ణ, జి.కిరణ్, జంగా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ నాటు సారా కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార గురువారం తెలిపారు. నకరికల్లు మండలం చేజర్ల తండాలో తనిఖీలు నిర్వహించామన్నారు. అక్కడ అక్రమంగా 10 లీటర్లు నాటు సారా కలిగి ఉన్న బాణావత్ రామకృష్ణా నాయక్‌ను అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.





మైనర్లూ.. వాహనాలు నడపకండి

ఎంవీఐ టీవీ నాగలక్ష్మి సూచన



మాట్లాడుతున్న ఎంవీఐ టీవీ నాగలక్ష్మి

చిలకలూరిపేట: మైనర్లు వాహనాలు నడపకూడదని, పిల్లల తల్లిదండ్రులు వారికి వాహనాలు ఇవ్వకూడదని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టీవీ నాగలక్ష్మి చెప్పారు. 35వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని చౌదరయ్య పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనర్లకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన లేకపోవడం, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వెల్లడించారు. పిల్లలు మోటార్ సైకిల్, కారు రేసింగ్‌లకు అలవాటుపడకుండా తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ రమేష్, ఆర్టీసీ డీఎం రాంబాబు, స్కూల్ డైరెక్టర్ ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.